వలంటీర్ల సేవలు అభినందనీయం

● వేడుకగా వలంటీర్లకు వందనం కార్యక్రమాలు

వలేటివారిపాలెం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని పోలినేనిపాలెం, కొండసముద్రం వలేటివారిపాలెం, కూనిపాలలెం గ్రామ సచివాలయాల్లో శుక్రవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పోలినేని పాలెం సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి అంజలి అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అనుమోలు అమరేశ్వరి, ఎంపీటీసీ సభ్యులు చింతలపూడి రవీంద్ర సేవమిత్ర అవార్డులు అందజేసి సత్కరించారు. వారు మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రికీ రాని వలంటీర్ వ్యవస్థ ఆలోచన మన ముఖ్యమంత్రి జగన్‌కే వచ్చిందని వీరు అటు ప్రజలకు ఇటు ప్రభుత్వానికి ఎన్నో రకాలుగా మేలు చేస్తున్నారని కొనియాడారు. ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉంటూ సంక్షేమ పథకాలు అందిస్తూ కృషి చేస్తున్నారన్నారు. కొండసముద్రం సచివాలయంలో సర్పంచ్ మన్నం వెంగమ్మ ముఖ్య అతిథిగా పాల్గొని సత్కరించారు. ఆమె మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమ ఫలాలు ప్రజలకు సక్రమంగా అందేలా వలంటీరులు అందిస్తున్న సేవలు అభినందనీయమని తెలిపారు. పోలినేనిపాలెం, వలేటివారిపాలెం, కొండసముద్రం, కూనిపాలెం సచివాలయాల్లో 30 మందిని సేవమిత్ర అవార్డులతో సత్కరించారు.

గుడ్లూరు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హత ఉన్న ప్రతి ఇంటికీ అందిస్తూ ప్రభుత్వానికి ప్రజలకు గ్రామ వలంటీర్లు సేవా వారధులుగా పని చేస్తున్నారని ఏపీఓ వినయ్ కొనియాడారు. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నాయుడుపాలెం, చినలాటరఫీ, చెమిడిదిపాడులో 36 మంది గ్రామ వలంటీర్లను సేవా మిత్ర పురస్కారాలతో ఘనంగా సన్మానించారు. ఏపీఓ మాట్లాడుతూ వలంటీర్లు ఎలాంటి లాభాపేక్ష ఆశించకుండా ప్రజలకు సేవచేసే అదృష్టం దక్కడం అభినందనీయమన్నారు. వలంటీర్లు ఇలాగే సేవాభావంతో పనిచేస్తూ ప్రజల నుంచి మన్ననలు పొందుతూ ప్రభుత్వానికి మంచిపేరు తీసుకు రావాలన్నారు.

ఉలవపాడు: మండల పరిధిలోని ఆత్మకూరు గ్రామంలో శుక్రవారం కార్యదర్శి అనిల్, గ్రామ సచివాలయ కన్వీనర్ వెంకట్రామిరెడ్డి వలంటీర్లను సత్కరించారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


వలేటివారిపాలెం: పోలినేనిపాలెంలో వలంటీర్లను సన్మానిస్తున్న ఎంపీటీసీ, సర్పంచ్ తదితరులు


గుడ్లూరు: చినలాటరఫీలో వలంటీర్లను సన్మానించిన దృశ్యం


ఉలవపాడు: ఆత్మకూరులో వలంటీర్లను సత్కరిస్తున్న సిబ్బంది

క్లుప్తంగా

పైప్ లైన్ పనుల పరిశీలన


రాళ్లపాడులో పైప్‌లైన్‌ను పరిశీలిస్తున్న డీఈ శ్రీనివాస్

లింగసముద్రం: మండలంలోని పెంట్రాల పంచాయతీలోని రాళ్లపాడు, తిమ్మారెడ్డిపాలెం పంచాయతీలోని శింగరపాలెం గ్రామాల్లో వేసిన అంతర్గత పైప్‌లైన్లను ఆర్‌డబ్ల్యూస్ క్వాలిటీ కంట్రోల్ డీఈ శ్రీనివాస్ శుక్రవారం పరిశీలించారు. పై రెండు గ్రామాల్లో ఏసైజ్ పైపులు వాడరని, ఎన్ని మీటర్లు వేశారని ఆర్‌డబ్ల్యూస్ ఏఈ సాగర్‌ను అడిగి తెలుసుకున్నారు. వి.క్రిష్టారెడ్డి, కె.క్రిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మట్టి తరలింపును అడ్డుకున్న ప్రజలు


మట్టి ట్రాక్టర్లను అడ్డుకుంటున్న గ్రామస్తులు

వలేటివారిపాలెం: మండలంలోని చుండి మట్టిని ఇటుక బట్టీ నిర్వాహకులు తరలిస్తుండగా, శుక్రవారం మండలంలోని చుండి, అయ్యవారిపల్లి గ్రామాలకు చెందిన ప్రజలు అడ్డుకున్నారు. చెరువులో మట్టి తరలించేందుకు వీలు లేదని చెప్పి, అదే సమయంలో చుండి గ్రామ సర్పంచ్ ఇరుపని సతీష్‌కు, ఇరిగేషన్ అధికారులతో పాటు ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేశారు. అనంతరం పోలీసులు ఆ స్థలానికి చేరుకున్నారు. ఇరిగేషన్ ఏఈను ఫోన్ ద్వారా సంప్రదించడానికి ప్రయత్నించగా ఎటువంటి జవాబు లేదు. డీఈ చెరియన్‌ను సంప్రదించగా చెరువులో మట్టి తరలింపు సంబంధించి 500 క్యూబిక్ మీటర్లు తీసేందుకు అనుమతులు ఇచ్చినట్లు చెప్పారు. అందుకు సంబంధించిన నగదును ప్రభుత్వానికి జమ చేసినట్లు వివరించారు.

70 మందికి వైద్య పరీక్షలు

హనుమంతునిపాడు: మండల పరిధి వీరరాంపురం గ్రామంలో శుక్రవారం ఇంటింటికీ ఫ్యామిలీ వైద్య సేవలో భాగాం 70 మందికి డాక్టర్ ప్రతాపురెడ్డి వైద్య పరీక్షలను నిర్వహించారు. వడ దెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలిచ్చారు. సర్పంచ్ ఆలా శివ, ఏఎన్‌ఎంలు, 104 వైద్య సిబ్బంది మస్తాన్, డేవిడ్ పాల్గొన్నారు.

గ్రంథాలయాలు సద్వినియోగం చేసుకోండి

కొండపి: విద్యార్థులు వేసవికాలంలో గ్రంథాలయాలకు వచ్చి పుస్తక పఠనం చేసి సద్వినియోగం చేసుకోవాలని గ్రంథపాలకుడు బత్తుల కోటేశ్వరరావు తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరానికి శుక్రవారం 21 మంది హాజరయ్యారు.

ముగిసిన సమ్మర్ క్రికెట్ పోటీలు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

కందుకూరు: మండలంలోని పందలపాడులో జాషువా యూత్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ముగిసింది. శుక్రవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో కందుకూరు ఫ్రెండ్స్ లెవన్స్ జట్టు టోర్నమెంట్ విజేతగా నిలవగా, పందలపాడు జాషువా లెవన్స్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. విజేతకు రూ. 20వేలు, రన్నరప్‌కు రూ. 10వేల నగదు బహుమతులను సుధాకర్, బద్రి, వర్ల దేవదాసుమాదిగ చేతుల మీదుగా అందుకున్నారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచిన అఖిలాష్‌కు హైకోర్టు న్యాయవాది చేవూరి శ్యామ్ కప్ అందజేశారు. జాషువా యూత్ సభ్యులు వర్ల రాజేష్, కోటయ్య, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

వల్లూరమ్మ ఆలయంలో బాలినేని ప్రత్యేక పూజలు


వల్లూరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న బాలినేని శ్రీనివాసులరెడ్డి

టంగుటూరు: జిల్లాలోని ప్రసిద్ధిగాంచిన వల్లూరమ్మ ఆలయంలో మాజీ మంత్రి వర్యులు, మాజీ రీజనల్ కోఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసులరెడ్డి శుక్రువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ ఈఓ రమేష్, ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ కాలే శ్రీనివాసులు, అర్చకులు బాలినేనిని పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అలాగే ఒంగోలుకు చెందిన నేత పటాపంజుల ఆశోక్‌కుమార్ అమ్మవారి మొక్కులు కార్యక్రమంలో పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి ఆశోక్‌బాబు, నాయకులు సూదనగుంట నారాయణరావు, ఆర్యవైశ్య చెర్మన్ కుప్పం ప్రసాద్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ యన్నాబత్తిన అరుణ, పీడీసీసీ బ్యాంకు చెర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య, ఒంగోలు డిప్యూటీ మేయర్ వేమూరి సత్యనారాయణ, పాల్గొన్నారు.

సొంత నిధులతో బోర్ ఏర్పాటు

సీఎస్‌పురం (పీసీపల్లి): మండల పరిధిలోని అయ్యలూరి వారిపల్లి సర్పంచ్ సొంత నిధులతో బోరు ఏర్పాటు చేశారు. అయ్యలూరి వారిపల్లి గ్రామస్తులు నీటి కొరతను సర్పంచ్ ముత్యాల భారతీ నారాయణరెడ్డికి దృష్టికి తీసుకరావడంతో 24 గంటల్లోపే రూ. 2 లక్షల సొంత నిధులతో బోరు ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు సర్పంచ్ దంపతులకు ఘనంగా సన్మానించారు. ముత్యాల రమణారెడ్డి పాల్గొన్నారు.

చుక్కల భూముల సమస్యకు పరిష్కారం


రైతులకు హక్కు పత్రాలు అందిస్తున్న కొండపి ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు

● సీఎం జగన్‌తో సాధ్యమైందన్న వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి వరికూటి

కొండపి: రాష్ట్రంలో కొన్ని దశాబ్దాలుగా పరిష్కారం కాని రైతులకు సంబధించిన చుక్కల భూముల సమస్యను పరిష్కరించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ సమస్యను చుక్కల్లో కలిపారని కొండపి నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వరికూటి అశోక్ బాబు అన్నారు. రెవెన్యూ రికార్డుల్లో చుక్కలు భూములుగా నమోదైన నియోజకవర్గంలోని 4,123 ఎకరాల రైతుల భూములను నిషేధిత భూముల జాబితా నుంచి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తొలగించి రైతులకు సంపూర్ణ హక్కులు కలిగించింది. ఈ సందర్భంగా కొండపి తహసీల్దార్ కార్యాలయంలో రైతులకు అందించిన పత్రాల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడారు. జగనన్న సాగించిన 3648కిలో మీటర్ల పాదయాత్రలో రైతులు చుక్కలు భూముల సమస్య గురించి తమగోడు వెల్లబోసుకోవటంతో రైతులకు అండగా నిలుస్తానని నాడి ఇచ్చిన హమీని నిలబెట్టుకున్నారన్నారు. రెవెన్యూ రికార్డుల్లో చుక్కలు భూములుగా నమోదైన సుమారు 2,06,171 ఎకరాల భూమిని 22ఏ నుంచి తొలగించి రాష్ట్రంలో 97,471 కుటుంబాలకు అండగా నిలిచారన్నారు. అదే విధంగా కొండపి, మర్రిపూడి, జరుగుమల్లి, టంగుటూరు, సింగరాయకొండ, పొన్నలూరు మండలాల్లోని 4123 మంది రైతులకు సంబంధించి 5146 ఎకరాలకు పైగా భూములను నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించి జగనన్న ప్రభుత్వం రైతన్నల పాలిట పెద్దమనస్సు చాటిందన్నారు. గత ప్రభుత్వంలో తమ భూములను ఆన్‌లైన్ చేయించుకోలేకపోయారని గడపగడపలో ఎంతో మంది రైతులు తన వద్ద బాధపడ్డారని తెలిపారు. జెడ్పీటీసీ సభ్యురాలు మారెడ్డి అరుణకుమారి, మండలపార్టీ అధ్యక్షులు గోగినేని వెంకటేశ్వరరావు, తహసీల్దార్లు పి. నరసింగరావు, శైలేంద్రకుమార్, సంగీతరావు, ఉషారాణి, ఉష, జగదీష్ పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలన దేశానికే ఆదర్శం

● వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు

● పెదవెంకన్నపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం


పెదవెంకన్నపాలెంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న అశోక్‌బాబు

పొన్నలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు అన్నారు. మండలంలోని పెదవెంకన్నపాలెంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లోని ప్రతి ఇంటికీ తిరిగి ప్రభుత్వ పథకాలను వివరించి, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల పథకంతో నిరుపేదల ఇంట సంక్షేమ పథకాల పంట పండుతోందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో నెరవేర్చి ప్రతి గడపకు సంక్షేమ పథకాలను అంజేస్తూ అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలేసి జన్మ భూమి కమిటీల పేరుతో ప్రజా ధనాన్ని దోచేశారన్నారు. టీడీపీ హయాంలో ఒక్క పథకం కూడా సక్రమంగా అమలు కాలేదన్నారు. కానీ నేడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ సున్నావడ్డీ, వైఎస్సార్ రైతు భరోసా, వైఎస్సార్ పింఛన్ కానుక, జగనన్న చేదోడు, అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన వంటి వినూత్న పథకాలతో నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు నగదును జమచేస్తూ గ్రామాల్లో పేదరిక నిర్మూలనకు కృషి చేస్తోందన్నారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి పనిచేస్తూ అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాల ప్రజలకు పారదర్శకంగా పథకాలను అందిస్తున్నారన్నారు. గ్రామాల్లోని నిరుపేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడాన్ని టీడీపీ నాయకులు చూసి ఓర్చుకోలేక పోతున్నారన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలకు సైతం ప్రభుత్వ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించి జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, మండల కన్వీనర్ పల్నాటి వెంకటేశ్వరరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ పిల్లి తిరుపతిరెడ్డి, సర్పంచ్ నవులూరి నరసింగరావు, నవులూరి మధు, వైఎస్సార్ సీపీ నాయకులు కోయ రాంబాబు, నవులూరి ప్రసాద్, పల్లపోలు బాలకోటిరెడ్డి, చేవూరి పద్మనాభరెడ్డి, ముప్పా కోటేశ్వరరావు, దావులూరి మాల్యాద్రి, ఇడవలపాటి మాధవ, అధికారులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

కందుకూరు: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపో వద్ద కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌డబ్ల్యూఎఫ్ మాజీ కార్యదర్శి ఏఎస్ రావు మాట్లాడుతూ క్యాడర్ స్ట్రెంత్ పేరుతో చేస్తున్న అక్రమ బదిలీలను ఆపాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు రావాలని బకాయిలను వెంటనే చెల్లించాలని, ఈహెచ్‌ఎస్ స్థానంలో ఆర్టీసీ వైద్యాన్ని అందించాలని, అద్దె బస్సుల స్థానంలో కొత్త బస్సులు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా సహాయ కార్యదర్శి గాజులవర్తి సురేష్ మాట్లాడుతూ ఆన్‌కాల్ డ్రైవర్ విధానానికి స్వస్తి పలికి రెగ్యులర్ డ్రైవర్‌లను నియమించి సిబ్బందిపై పనిభారం తగ్గించాలన్నారు. డిపోలో పెండింగ్‌లో ఉన్న సమ్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ సహాయ కార్యదర్శి గౌస్, కె.ఎస్ రావు, జబ్బీర్ బాష, షేక్ రఫీ, వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా కట్టడికి చెక్‌పోస్టులు

సింగరాయకొండ: స్థానిక సెబ్ సర్కిల్ కార్యాలయం పరిధిలో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకునేందుకు అడిషనల్ ఎస్పీ కె. నాగేశ్వరరావు ఆదేశాల ప్రకారం అయిదు ప్రాంతాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు సెబ్ ఎస్సై సి.హెచ్ దయాకర్ అన్నారు. కలికవాయ అంజేయస్వామి విగ్రహం, కె. బిట్రగుంట అంజేయస్వామి విగ్రహం, జరుగుమల్లి తహసీల్దార్ కార్యాలయం రోడ్డు, చింతలపాలెం ఆంజనేయస్వామి విగ్రహం వద్ద, కామేపల్లిలో కొండపి రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం సమీపంలో ఏర్పాటు చేసినట్లు వివరించారు. జరుగుమల్లి, సింగరాయకొండలో శుక్రవారం అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఎం. సుధీర్‌బాబు, జేడీ టీం సీఐ కె. వంశీధర్ తనిఖీ చేసినట్లు వివరించారు.

టిప్పర్‌ని ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

టంగుటూరు: ముందు వెళ్తున్న టిప్పర్‌ను ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన టంగుటూరు సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం చోటుచేసుకుంది. రామపట్నం పోర్టు పనుల నుంచి ఒంగోలు వైపు వస్తుండగా టంగుటూరు ప్రియాంక కాటా వద్ద వెనుక వైపు నుంచి ద్విచక్ర వాహనంపై ఒంగోలు వెళ్తున్న యువకుడు, యువతి వెనుక నుంచి ఢీకొట్టారు. ద్విచక్ర వాహనంతో పాటు యువకుడు, యువతి పడి తీవ్ర గాయాలయ్యాయి. అంబులెన్సులో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. వాహనదారుడు హెల్మెటు ఉండటంతో తలకు ఎలాంటి గాయాలు కాలేదు. క్షతగాత్రులు మాట్లాడే స్థితిలో లేకపోటంతో వాటి వివరాలు తెలియదు.

939 పొగాకు బేళ్లు కొనుగోలు

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో వేలం కేంద్రం అధికారి ఎస్. రామారావు నిర్వహించిన పొగాకు వేలంలో వ్యాపారులు 939 పొగాకు బేళ్ళు కొనుగోలు చేశారు. వేలంకేంద్రం పరిధిలోని కామేపల్లి, పచ్చవ గ్రామాల నుంచి పొగాకు రైతులు శుక్రవారం 998 పొగాకు బేళ్ల వేలానికి తెచ్చుకున్నారు. అత్యధిక ధర రూ. 200 పలకగా, అత్యల్ప రూ. 152 పలికింది. సరాసరి ధర రూ. 199.21 వంతున దక్కింది.

509 పొగాకు బేళ్ల కొనుగోలు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో శుక్రువారం నిర్వహించిన వేలంలో 509 పొగాకు బేళ్ల కొనుగోలు వ్యాపారులు కొనుగొలు చేశారు. టంగుటూరు, జరుగుమల్లి, సాధువారిపాలెం గ్రామాలకి చెందిన రైతులు 536 బేళ్ళను వేలాని తీసుకురాగా వాటిలో 509 కొనుగోలు జరిగగా, 27 పొగాకు బేళ్ల తిరస్కరణ జరిగాయి. గరిష్ట ధర రూ. 201 కాగా, కనిష్ట ధర రూ. 160 పలకగా, సరాసరి రూ. 199. 70 ధర పలికింది. 23 మంది వ్యాపారులు పాల్గొన్నారని వేలం నిర్వహనాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

పొగాకు కేజీ ధర రూ. 201

కందుకూరు: పొగాకు వేలంలో రికార్డు ధరలు నమోదవుతున్నాయి. శుక్రవారం కందుకూరు-1వ వేలం కేంద్రంలో జరిగిన వేలం గరిష్ట ధర రూ. 201 గా నమోదైంది. కందుకూరు-1లో 316 బేళ్లు అమ్ముడు పోయాయి. కందుకూరు-2లో కేజీ పొగాకు అత్యధికంగా రూ. 200 నమోదైంది.

విద్యార్థులకు పోటీలు

ఉలవపాడు: స్థానిక శాఖ గ్రంథాలయంలో శుక్రవారం డిక్టేషన్ పోటీలు నిర్వహించారు. ముందుగా పుస్తక పఠనం చేయించారు. స్థానిక గ్రంథపాలకుడు దాసరికోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిపారు.

29న తల గ్రామ కాపు ప్రమాణ స్వీకారం

సింగరాయకొండ: మండలంలోని పాకల పంచాయతీ పోతయ్యగారి పట్టపుపాలెంలో ఈనెల 29న ఉదయం 11 గంటలకు తల గ్రామ కాపు ప్రమాణ స్వీకారం నిర్వహించనున్నట్లు మత్స్యకార గ్రామ పెద్దలు తెలిపారు. 64 గ్రామాలకు తల గ్రామ కాపుగా పోతయ్యగారి పట్టపుపాలేనికి చెందిన కాపు వాయిల జాలయ్య కుమారుడు వాయిల మురళిని ఎన్నుకోనున్నట్లు గ్రామ పెద్దలు వివరించారు.

50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

హనుమంతునిపాడు: రైతులకు 50 శాతం రాయితీపై పచ్చి రొట్టి విత్తనాలు సరఫరా చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి ఎం.గోపి కృష్ణ అన్నారు. రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. రైతు సంఘాల చైర్మన్ గాండ్ల పర్తి వెంకటేశ్వరెడ్డి, వీఏఏలు పాల్గొన్నారు.

పండ్ల తోటల దరఖాస్తుల ఆహ్వానం

మర్రిపూడి: మండలంలో 5 ఎకరాల్లోపు భూమి ఉన్న సన్న, చిన్నకారు రైతులు పండ్ల మొక్కలు పెంచుకునేందుకు దరఖాస్తు చేసుకోవాలని ఏపీఓ రాంబాబు శుక్రవారం తెలిపారు.మామిడి, జీడి, సీతాఫలం, నిమ్మ, జామ, సపోట, కొబ్బరి, తైవాన్ జామ వంటివి పెంచుకోవచ్చన్నారు.

నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి రూ.136 కోట్లు


పనులను పరిశీలిస్తున్న చైర్మన్ గఫార్, కమిషనర్ నారాయణరావు

కనిగిరి రూరల్: పట్టణంలోని పలు వార్డుల్లో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, కమిషనర్ డీవీఎస్ నారాయణరావు శుక్రవారం పర్యటించారు. పదో వార్డులోని అర్బన్ కాలనీలో జరుగుతున్న ఇంటింటికీ సాగర్ నల్లా పనులను చైర్మన్, కమిషనర్, కౌన్సిలర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ కృషితో పట్టణంలో నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి రూ. 136 కోట్ల పథకాన్ని సీఎం మంజూరు చేసినట్లు చెప్పారు. ఏఐఐబీ స్కీంలో జరుగుతున్న పనులు వేగవంతంగా జరిగేందుకు పలు సూచనలు చేశారు. కమిషనర్ డీవీఎస్ నారాయణరావు మాట్లాడుతూ పట్టణంలో చేపట్టే నూతన గృహ నిర్మాణాలకు ప్లాన్ అప్రూవల్ తప్పని సరిగా తీసుకోవాలన్నారు. మున్సిపల్ అనుమతి లేకుండా చేపట్టే నిర్మాణాలపై చర్యలు ఉంటాయని తెలిపారు. కౌన్సిలర్ దాసరి మురళి, స్థానిక నాయకులు పాల్గొన్నారు. అలాగే 18వ వార్డులో జరుగుతున్న కొత్త డ్రైనేజీ పనులు కమిషనర్ డీవీఎస్ నారాయణరావు, చైర్మన్ గఫార్‌లు పరిశీలించారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

కనిగిరి రూరల్: లింగ నిర్ధారణ పరీక్షలు నేరమని ఆర్డీఓ టి. అజయ్ కుమార్ అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం సీపీఎన్‌డీటీ యాక్ట్ సబ్ డివిజనల్ లెవల్ మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. స్కాన్ సెంటర్‌లు రిజిస్టర్లు అమలు చేయాలన్నారు. మున్సిపల్ చైర్మన్, న్యాయవాది ఎస్‌కే అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ ప్రభుత్వం బాలికా విద్యకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ సృజన, పారాలీగల్ వలంటీర్స్ రమేష్, నవకుమార్ పాల్గొన్నారు.

కనిగిరి రూరల్: బాల్య వివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యతని సీడీపీఓ సరోజని అన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో శుక్రవారం బాల్యవివాహాల నివారణపై అవగాహన కార్యక్రమం జరిగింది. బాల్య వివాహాలను ఆపి, బాలల భవిష్యత్తు కాపాడాలని పిలుపునిచ్చారు. మాచవరం క్లస్టర్ సూపర్‌వైజర్ మల్లేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయండి

కందుకూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న జగనన్న లేఅవుట్‌ల్లోని గృహ నిర్మాణాలను వేగంగా పూర్తి చేసేందుకు క్షేత్ర స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని గృహ నిర్మాణ శాఖ పీడీ నరసింహులు సూచించారు. శుక్రవారం కందుకూరు మున్సిపాలిటీ పరిధిలో మహదేవపురం లేఅవుట్‌ను పరిశీలించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ప్రయోజనాలను లబ్ధిదారులకు వివరించాలన్నారు. అనంతరం కొండముడుసుపాలెంలోని సచివాలయం సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ఈఈ పీవీఎస్ శర్మ, ఏఈ సీహెచ్ శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జరుగుమల్లి (సింగరాయకొండ): జగనన్న లేఅవుట్ లో గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి, ఒంగోలు దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ గ్రంథి మాధవి సూచించారు. జరుగుమల్లి మండలం చింతలపాలెం జగనన్న లేఅవుట్ వద్ద శుక్రవారం గృహనిర్మాణాలపై సమీక్ష నిర్వహించారు. 130 ప్లాట్లకు గాను 45 మాత్రమే పూర్తయ్యాయని మిగిలిన ప్లాట్లు వివిధ దశలలో నిర్మాణంలో ఉన్నాయన్నారు. తహసీల్దార్ సి.హెచ్ ఉషారాణి, ఎంపీడీఓ పి. రామకృష్ణ, హౌసింగ్ ఈఈ పి. శ్రీనివాస్‌ప్రసాద్, డీఇ జయరావు, ఏఈ అవినాష్, మాజీ ఎంపీపీ బెల్లం సత్యన్నారాయణ పాల్గొన్నారు.

గుడ్లూరు: వెంటనే నిర్మాణాలు చేపట్టాలని ఎంపీడీఓ చంద్రసేన్ చెప్పారు. గుడ్లూరులోని సచివాలయం-2లో నవరత్నాలు పేదలందరికీ ఇళ్ళు కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇసుక, సిమెంటు, ఇతర మెటీరియల్ ప్రభుత్వం ద్వారా అందిస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శి అనూష పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసానికి భగవద్గీత

పీసీపల్లి: వ్యక్తిత్వ వికాసానికి భగవద్గీత పఠనం చాలా అవసరమని త్రైత సిద్ధాంతం- ప్రబోదా సేవాసమితి ఇందు జ్ఞాన వేదిక -దొనకొండ కమిటీ అధ్యక్షులు ఏడుకొండలు అన్నారు. శుక్రవారం కొత్త ఏరువారిపల్లి, బట్టుపల్లి, పెదచెర్లోపల్లి గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత, ఇతర గ్రంథాల ఆవశ్యకతను ప్రచారం నిర్వహించారు. జి. తిరుపతయ్య, సాయినాథ్, బొహరా, రాఘవ, చిరంజీవి, శ్రీనివాసరెడ్డి, నారాయణమ్మ, కోటేశ్వరి, అరుణ తదితరులు ఉన్నారు.

సమయపాలన పాటించాలి

లింగసముద్రం: సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించి విధులు సక్రమంగా నిర్వర్తించాలని ఎంపీడీఓ శేషుబాబు చెప్పారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం మండలంలోని వీఆర్ కోట, అన్నెబోయినపల్లె సచివాలయాలను తనిఖీ చేశారు.

వెలిగండ్ల: విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటానని ఎంపీడీఓ టి. సుకుమార్ అన్నారు. గుడిపాటిపల్లి, పి. నాగులవరం, పి. రాళ్లపల్లి, ఇమ్మడిచెరువు, రామగోపాలపురం గ్రామ సచివాలయాలను ఎంపీడీఓ టి. సుకుమార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సర్పంచ్ టి. సురేష్‌బాబు, పీఎస్ షకీల ఉన్నారు.

గుడ్లూరు: మండలంలోని అమ్మవారిపాలెం గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ చంద్రసేన్ శుక్రవారం తనిఖీ చేశారు. సచివాలయానికి వచ్చే ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా కృషి చేయాలన్నారు.

ట్రిపుల్‌ఆర్ సెంటర్ ప్రారంభం

కనిగిరి రూరల్: చెత్త రహిత కనిగిరిలో ప్రతి ఒక్కరూ భాగ స్వాములు కావాలని మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక పీవీఆర్ పార్క్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ట్రిపుల్‌ఆర్ సెంటర్‌ను చైర్మన్ అబ్దుల్ గఫార్ శుక్రవారం ప్రారంభించారు. చైర్మన్ గఫార్ మాట్లాడుతూ వినియోగంలోకి రాని వస్తువులను ట్రిపుల్‌ఆర్ సెంటర్‌కు తెచ్చి ఇవ్వాలని తెలిపారు. కమిషనర్ డీవీఎస్ నారాయణరావు మాట్లాడుతూ రెడ్యూస్, రీయూస్, రీసైక్లిన్ (ట్రిపుల్ ఆర్) సెంటర్‌లో పనికిరాని వ్యర్థ పదార్థాలను సేకరణ చేసి, పునరుత్పత్తి చేయడం జరుగుతోందన్నారు. వైస్ చైర్మన్ మాణిక్యరావు, కౌన్సిలర్లు దేవరాజ్, దాసరి మురళి, శానటరీ ఇన్‌స్పెక్టర్ చెన్న కేశవులు, సచివాలయ శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

మా క్లయింటు, ప్రకాశం జిల్లా, జరుగుమల్లి మండలం, చింతలపాలెం గ్రామ వాస్తవ్యులు నలమోతు అబ్బయ్య నాయుడు అలియాస్ అబ్బయ్య (లేటు) కుమారుడు వీరాంజనేయులు ప్రస్తుత నివాసం 2129 బ్రిటాన్ డి.ఆర్ మెకనీ టెక్సాస్ స్టేట్ 75071, యు.ఎస్.ఎ అను వారు ఇచ్చిన సంజాయిషీ మేరకు యావన్మందికి తెలియజేయునది ఏమనగా,

ఈ క్రింది షెడ్యూలు దాఖలా భూములు మా క్లయింటు యొక్క తండ్రిగారైన నలమోతు అబ్బాయియుడు గారికి వంశపారం పర్యంగా సంక్రమించిన భూములై ఉన్నాయి.మా క్లయింట్ తండ్రి గారైన నలమోతు అబ్బానాయుడు గారు 1994లో ఇంటస్టేట్ గా మరణించినారు. మా క్లయింట్ యొక్క తండ్రి మరణానంతరం వారసత్వ రీత్యా షెడ్యూలు భూములు మా క్లయింటుకు సంక్రమించబడి మా క్లయింట్‌కు మాత్రమే హక్కులు కలిగిన భూములైయున్నవి. మా క్లయింటు వృత్తిరీత్యా ఇతర దేశాలలో స్థిరపడి ఉండి యున్నందున, షెడ్యూలు భూములను పర్యవేక్షించుకోలేని స్థితిలో, అదే అదనుగా షెడ్యూలు భూములను మా క్లయింటుకు తెలియకుండా మోసపూరితంగా నలమోతు చెంచమ్మ (లేటు) గారి నుండి బెల్లం వెంకట నరసయ్య గారి కుమారుడు వెంకట రమణయ్య గారు సెటిల్‌మెంట్ దస్తావేజు ద్వారా పొందినట్లుగాను, రెవెన్యూ రికార్డులలో బెల్లం వెంకట రమణయ్య గారు తన పేరును మ్యుటేషన్ చేయించుకొని, పరాదీనం చేయ ప్రయత్నిస్తున్నట్లుగా మా క్లయింట్‌కు రూఢీగా తెలిసినది.

షెడ్యూలు భూములపై మా క్లయింటుకు గల హక్కులను భంగం కలుగజేస్తూ ఏ విధమైన లావాదేవీలు చేసినా అవి చట్టరీత్యా చెల్లనేరవని, అలాంటి పరాధీనములేవీ మా క్లయింటుకు షెడ్యూలు భూమిపై గల హక్కులను బద్దపరచజాలవని, మా క్లయింట్ యొక్క షెడ్యూలు భూముల విషయమై మా క్లయింటు హక్కులకు భంగము కలిగించే ఎలాంటి దస్తావేజులు సృష్టించినా, పరాధీనములు చేసినా, అలాంటి వారందరిపై మా క్లయింటు చట్టపరమైన సివిల్, క్రిమినల్ చర్యలు గైకొనగలరని ఇందు మూలముగా యావన్మందికి తెలియపరచటమైనది.

షెడ్యూల్

ఐటమ్ నెం.1 : ప్రకాశం జిల్లా - సింగరాయకొండ సబ్ రిజిస్ట్రేషన్ - జరుగుమల్లి మండలం - చింతలపాలెం గ్రామం - సర్వేనెం 211/2 - పూరా నెంబర్ విస్తీర్ణం య.2-73సెంట్లు (తుమ్మలగుంట చేను) భూమికి హద్దులు:-

ఐటమ్ నెం.2 : ప్రకాశం జిల్లా సింగరాయకొండ సబ్ రిజిస్ట్రేషన్ - జరుగుమల్లి మండలం - చింతల పాలెం గ్రామం - సర్వే నెం.508/1 - పూరా నెంబర్ విస్తీర్ణం య.1-60 సెంట్లు భూమికి హద్దులు. **తూర్పు:** డొంక, **దక్షిణం :** మా క్లయింట్ యొక్క నిల్వ భూమి. **పడమర :** నలమోతు సుబ్బమ్మ గారి భూమి. **ఉత్తరం:** తానికొండ సింగయ్య, నల్లూరి చెంచయ్య గార్ల భూములు.

ఐటమ్ నెం.3 : ప్రకాశం జిల్లా - సింగరాయకొండ సబ్ రిజిస్ట్రేషన్ - జరుగుమల్లి మండలం - దావగూడురు గ్రామం - సర్వే నెం.124/1 & 118/1 - పూరా నెంబర్ విస్తీర్ణం య.1-56 సెంట్లు భూమికి హద్దులు : **తూర్పు:** బెల్లం కొండయ్య మరియు వెంకట నరసయ్య గార్ల భూమి. **దక్షిణం:** రావూరి వీరాస్వామి గారి భూమి. **పడమర:** నలమోతు జాలమ్మ వగైరాల భూమి. **ఉత్తరం:** గందవళ్ళ పున్నయ్య భూమి.

ఒంగోలు.
తేది. 26-05-2023

వంగులూరి గోవిందయ్య, గనిపినేని శ్రీనివాసులు,
అడ్వకేట్స్, ఒంగోలు.